క్లుప్తంగా

రామాలయం హుండీ కానుకల లెక్కింపు



మాచర్ల: పట్టణంలోని కోదండ రామాలయంలో ఆలయ అధ్యక్షుడు బచ్చు రామారావు, పలువురు పెద్దలు, భక్తులు ఆధ్వర్యంలో ఆదివారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ గత నెలలో నూతన కార్యవర్గం ఎన్నికైన తర్వాత ఇంత వరకు హుండీల లెక్కింపు జరపలేదన్నారు. ఆలయ హుండీల లెక్కింపు జరపగా రూ.15,300లు వచ్చినట్లుగా తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నెలవారీ ఖర్చుల నిమిత్తం వినియోగించనున్నట్లు చెప్పారు. భక్తులు, చందాదారుల, కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో స్వామి వారి కైంకర్యాలన్నీ సకాలంలో నిర్వహిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి కొత్తూరి వెంకట బాల కోటేశ్వరరావు, కోశాధికారి మేడం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మారం శ్రీనివాసరావు, చీదెళ్ళ అంజనేయులు, ఉప కార్యదర్శులు పందిరి నరసింహారావు, కర్నాటి అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోరి షిర్డి సాయిబాబా మందిరంలో ధనుర్మాస పూజలు ఆదివారం భక్తులు విశేషంగా నిర్వహించారు. 14వ రోజు పూజా కార్యక్రమంలో దంపతులు, మహిళా భక్తులు ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



పిడుగురాళ్ల: ఆరోగ్య పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివేకానంద పాఠశాల డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని పాఠశాలలో ఆదివారం గ్రీన్ కలర్ డే సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. నర్సరీ నుంచి 1వ తరగతి విద్యార్థులతో గ్రీన్ కలర్ డే పురస్కరించుకొని పలు రకాల కూరగాయల, పండ్ల బొమ్మలను గీయించి విటి పోషకాలను వివరించారు. అనంతరం బహుమతులు ప్రదానంచేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసవీ సేవా సమితి కోశాధికారిగా మునేశ్వరరావు



పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా వాసవీ సేవా సమితిల సమైఖ్య కోశాధికారిగా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన గజవల్లి వెంకట నాగ మునేశ్వరరావును ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా వాసవీ సేవా సమితిల సమైఖ్య అధ్యక్షుడు గర్నె పుల్లారావు నియామకపు పత్రాన్ని పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో అందజేశారు. పలువురు ఆర్యవైశ్యులు, సమితిల సమాఖ్య సభ్యులు హాజరై ప్రసంగించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ సేవా సమితి సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



పిడుగురాళ్ల: పాత ఇనుము లోడు లారీ అదుపు తప్పి పడిపోయిన ఘటన మండలంలోని తుమ్మలచెరువు చెట్టు సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ... పిడుగురాళ్ల వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న పాత ఇనుము లోడు లారీ రాత్రి సమయంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీలోని పాత ఇనుము ఇనుప సామగ్రి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

ఆశల ఏడాది..

- నూతన సంవత్సర వేడుకల ప్రణాళికల్లో యువత
- వేడుకలతో పాటు పుంజుకున్న పలు వ్యాపారాలు
- కేకులు, వస్త్రాలు, రంగ వల్లులు అన్నింటిలోనూ జోరు
- సరికొత్త ఆశలతో, మార్పులతో స్వాగతం చెప్పేందుకు సిద్ధం



పలు డిజైన్లలో సిద్ధంగా ఉన్న కేకులు



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చర్చిలో ఏర్పాటు చేసిన లైటింగ్

గురజాల: నూతన సంవత్సరం వచ్చేసింది. మర్నాడు కొత్త ఆశల ఏడాదిలోకి అడుగు పెట్టబోతున్నాం. ఆహ్వాన వేడుకలకు ఎవరి ప్రణాళికల్లో వారు బిజీగా ఉన్నారు. పల్లె, పట్టణం అంతటా సందడి వాతావరణం నెలకొంది. దీంతో పాటు వేడుకలకు అనుబంధమైన వ్యాపారాలు కూడా జోరందుకున్నాయి. పలు రకాల పూలకు డిమాండ్ పెరిగింది. శుభాకాంక్షలు తెలుపుతూ అందించే పుష్పగుచ్ఛాలు మార్కెట్లో ఇప్పటికే రకరకాల ఆకృతుల్లో సిద్ధమవుతున్నాయి. అభినందనలతో పాటు సంబరాల ప్రారంభ సూచికం.. కేక్ కటింగ్‌లు ఇయర్ ఎండింగ్ అర్ధ రాత్రి భారీగా జరగనున్నాయి. దీంతో బేకరీల నిర్వాహకులకు పని పెరిగింది. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వివిధ ఆకారాల్లో సృజనాత్మకతకు పదును పెట్టి కేకులు తయారుచేస్తున్నారు. ఇప్పటి నుంచి ఆర్డర్స్ వస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

జిహ్వకో ఫ్లేవర్..

కేకు కోయనిదే న్యూ ఇయర్ వేడుకల్లో ఆనందం ఉండదు. అభిరుచికి అనుగుణంగా యువత వివిధ ఫ్లేవర్లలో కేకులు ఆర్డర్లు ఇస్తున్నారు. వెనిలా, బటర్ స్కాచ్, పైనాపిల్, కస్టర్డ్ ఆపిల్ వంటి బ్రాండెడ్ కేకులకు ప్రియార్టీ ఇస్తున్నారు. వీటితో పాటు కూల్ కేక్‌లకు భారీగానే డిమాండ్ ఉంది. దీంతో వ్యాపారులకు చేతి నిండి పనిదొరికింది.

రంగవల్లులతో స్వాగతం..

పండగ ఏదైనా..ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్దాల్సిందే. పల్లెల్లో ముగ్గుకు, అందులో కలిపే రంగులకు ఆదరణ ఉంది. సోషల్ మీడియాలో జీవించే యువతలు కూడా సాంప్రదాయలపై మక్కువ చూపిస్తున్నారు. పట్టణాల్లోనూ తమ ఇళ్ల ముందు రంగవల్లులు వేసి, వాట్సాప్ స్టేటస్‌లో పెడుతున్నారు. ఈ నూతన సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు తాము సిద్ధమంటున్నారు. కొత్త ఏడాది ప్రారంభం నుంచి సంక్రాంతి వరకు ఇళ్ల ముందు పెద్ద పెద్ద ముగ్గులు కనిపిస్తూనే ఉంటాయి. మార్కెట్లో అన్ని రకాల రంగులు అందుబాటులో ఉన్నాయి. ఇవనే కాదు.. బాణ సంచా, గ్రీటింగ్ కార్డ్స్, నూతన దుస్తులు, పూజా సామగ్రి విక్రయాల వేగం పుంజుకుంటున్నాయి. వేడుకలను కుటుంబ సమేతంగా జరుపుకోవాలని, మద్యం మత్తు ఆనందాలను మింగేయకుండా చూసుకోవాలని పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు..



రంగ వల్లులకు అద్దు రంగులు విక్రయిస్తున్న మహిళ

ఇన్‌చార్జి ఎంఈఓ కాంతారావు మృతి



ఎంఈఓ 1 కె.కాంతారావు (ఫైల్

మాచర్ల రూరల్: మండల విద్యాశాఖాధికారి 1 కూరగంటి కాంతారావు (58) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన విజయపురి సౌత్ ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తూ ఎంఈఓ 1 ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. వెల్దుర్తి, మాచర్ల, దాచేపల్లి, గురజాల మండలాలకు ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. క్రిస్మస్ పండుగ నిమిత్తం ప్రకాశం జిల్లా, అద్దంకిలో ఉంటున్న పెద్ద కుమార్తె వద్దకు వెళ్లారు. అక్కడ ఛాతిలో మంట రావడంతో కుటుంబ సభ్యులు వైద్య శాలకు తీసుకెళ్లి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంఈఓ మృతి పట్ల మాచర్ల ఎంఈఓ 2 అల్లి సురేష్, ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు జూపల్లి గంగాధర్‌బాబు, షేక్ సిలార్ అహ్మద్, నాసర్‌రెడ్డి, షేక్ నసీర్, నాగరాజు, కేశవరెడ్డి, కృష్ణారావు, కొర్లయ్య, కృష్ణానాయక్, రవికుమార్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మహా సభలను జయప్రదం చేయండి



ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి

మాచర్ల రూరల్ ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర కౌన్సిలర్ పి.ప్రేమ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర మహాసభ ప్రచార కార్యక్రమాన్ని పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయ హక్కులు, సంక్షేమం కోసం ఏర్పడ్డ సంఘం యూటీఎఫ్ అన్నారు. ఉద్యమాలకు పురిటిగడ్డ పల్నాటి ప్రాంతంలో ఎన్నో సమస్యలను పరిష్కరించి, ఉపాధ్యాయుల పక్షాన నిలిచిన చరిత్ర యూటీఎఫ్‌దే అన్నారు. ప్రభుత్వ విద్యా రంగ విధానాలపై జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలలో యూటీఎఫ్ సర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభలకు మాచర్ల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శులు మోహన్‌రావు, ఎ.నాసర్‌రెడ్డి, ఎ.శ్రీనివాసరావు, మాచర్ల అధ్యక్షుడు షేక్ నసీర్, కార్యదర్శి ఎస్.ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు. యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకుడు ఎస్‌వీఎస్ నాగరాజు ఆవిష్కరించి, బైకు ర్యాలీ నిర్వహించారు.

సాఫ్ట్‌వేర్‌పై విద్యార్థులకు దిశా నిర్దేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

మాచర్ల రూరల్: మండలంలోని అలుగురాజుపల్లిలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సాఫ్ట్‌వేర్ రంగం వైపు మొగ్గు చూపే విద్యార్థులకు హైదరాబాద్ ఇన్ఫినిటీ మెగా టెక్నాలజీస్ సీఈఓలు సుభాష్, రుక్సానా, ఎస్‌వీఆర్ వికాస్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటెక్, డిగ్రీ తరువాత సాఫ్ట్‌వేర్ రంగంలోకి ఏ విధంగా రావాలి. ఏ ఏ కోర్సులు భవిష్యత్తులో తీసుకుంటే మంచి ఉపాధి అవకాశాలు కలుగుతాయో వివరించారు. మూడు నెలల ఇంటర్న్‌షిప్ చేయించి ప్లేస్‌మెంట్ ఇప్పించటం జరుగుతుందన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఆసక్తి ఉన్న వారిని మోసం చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి ప్రియాంక, కరస్పాండెంట్ జున్నా శ్రీనివాస రెడ్డి, శివ నాయక్, ప్రిన్సిపాళ్ళు, ఏఓలు పాల్గొన్నారు. వివరాలకు 73824 27742, 85200 99255 సంప్రదించాలన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

రెంటచింతల: మిట్టగుడిపాడు, గోలి గ్రామాల్లో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీ సభ్యులు ఆదివారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ మార్గశిర మాసం అంటే.. శిరం అనగా తల అని మార్గం అనగా దారి అని, తలలోనికి దారి అనే విధానం ఉన్నదని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. గురువు నుంచి జ్ఞానాన్ని పొందిన శిష్యుడు కార్తీక మాసంలో దీపపు వెలుగులో అనగా యోగ మార్గంలో ప్రయాణించిన శిష్యుడు ఇక్కడ మార్గశిర మాసంలో తలలోని ఆత్మ వద్దకు చేరుటకు సులభంగా దారి ఏర్పడుతుందన్నారు. కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్ అనురాధ, ఎన్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై. రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరనాయక్‌లు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐది కీలక పాత్ర

అరసం నేత కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతిశ్రీ



పెదకూరపాడులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న శరత్‌చంద్ర జ్యోతి

పెదకూరపాడు: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని అరసం ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి, సీపీఐ పల్నాడు జిల్లా నాయకుడు కొమ్మాలపాటి శరత్చంద్రజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం పెదకూరపాడులో పార్టీ శత వార్షికోత్సవాల ఘనంగా నిర్వహించారు. కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతి శ్రీ పార్టీ జెండా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మున్న గోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శరత్ చంద్ర మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తాడిత పీడిత ప్రజల హక్కుల పరిరక్షించడంలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన పాత్ర పోషించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు బైరా పట్నం రామకృష్ణ మాట్లాడారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

సత్తెనపల్లి ఆర్డీఓ రమణకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి

సత్తెనపల్లి: స్కాన్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీ రమణ కాంత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం పీసీ, పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశంజరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కాన్ సెంటర్లు చట్ట ప్రకారం నియమాలను పాటించాలన్నారు. వాటిని అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రధానంగా స్కానింగ్ కేంద్రాల్లో బ్యానర్లు సక్రమంగా ప్రదర్శించాలని, సరైన రికార్డులు, ఇతర నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లింగ నిర్ధారణ నేరమని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కమిటీ కన్వీనర్, సత్తెనపల్లి డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల తనిఖీల్లో గమనించిన విషయాల గురించి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో ఆయా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల జయప్రదానికి పిలుపు

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సంఘం ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని పిడుగురాళ్ల యూటీఎఫ్ శాఖ నాయకులు ఆదివారం పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా శాఖ ప్రచార జాత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ప్రచార జాత జిల్లా అంతటా ప్రచారం నిర్వహిస్తూ పిడుగురాళ్ల ప్రాంతంలోకి ప్రవేశించిన సందర్భంలో యూటీఎఫ్ పిడుగురాళ్ల ప్రాంతీయ శాఖలు వారికి ఆహ్వానం పలికి పిడుగురాళ్లల్లో ర్యాలీ నిర్వహించారు. నాయకులు మందా జాకబ్, ఎం.నాగయ్యల యూటీఎఫ్ పతాక ఆవిష్కర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రచార జాత ర్యాలీని కొండమోడు వరకు పంపి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావుతోపాటు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

పిడుగురాళ్ల: వాకింగ్‌కు వెళ్తున్న మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు అపహరించి పారిపోయిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని బ్రహ్మగారి గుడి సమీపంలోని ఆదివారం ఉదయం జరిగింది. ఘటనకు సంబంధించి బాధితురాలు లక్ష్మీ సుశీల పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ ఎం .మోహన్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

దొడ్లేరులో మెగా జాబ్ మేళా

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో రావిపాటి కల్యాణ మండపంలో ఆదివారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని ప్రతి మూడు నెలలకు జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో దిగ్గజ ఫార్మకంపెనీలు కూడా హాజరువుతాయన్నారు. జాబ్‌మేళాకు 35 కంపెనీలు హాజరుకాగా 1800 మంది నిరుద్యోగులు హాజరువ్వగా 600 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు జాబ్‌మేళా కో–ఆర్డినేటర్ తెలిపారు. ఎంపికైన వారికి ఎమ్మెల్యే చేతుల మీదగా నియామక పత్రాలను అందచేసారు. అనంతరం గ్రామంలోని తాగునీటి చెరువును సందర్శించి భూగర్భజలాలు బలోపేతయయ్యేలా తగువిధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, దొడ్లేరు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పెదకూరపాడు: మండలంలోని జలాలపురం గ్రామంలో చెరువు కట్ట మీద ఉన్న చెట్టు కింద పేకాటాడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండల పరిధిలో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా?



ప్రమాదం జరిగిన ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రమాదంలో ధ్వంసమైన కారు(ఫైల్

పిడుగురాళ్ల: ప్రమాదాలు జరిగితే తప్పా సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేని పరిస్థితి అధికారుల్లో నెలకొంది. ఇటీవలే మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో అద్దంకి నార్కెట్‌పల్లి హైవేపై గీతిక సీబీఎస్‌సీ స్కూల్ సమీపంలో మూల మలుపు వద్ద కారు ప్రమాదం ఘటనలో నలుగురు మృతి చెందారు. ఈ నెల 8న తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఈ ప్రాంతంలోని మూల మలుపులో అతివేగంగా వస్తున్న వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ముందస్తు హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు అప్రమత్తం కాలేకపోతున్నారు. రేడియం స్టిక్కర్లతో ప్రమాదం జరుగు మూల మలుపుల్లో ఏర్పాటు చేస్తే..రాత్రిళ్ల వాహనాల లైట్ల వెలుగుకు వాహనాలు నడిపే వారికి హెచ్చరిక బోర్డులు స్పష్టంగా కనిపిస్తాయి. అటువంటి సమయంలో వాహనదారులు వేగం తగ్గించుకొని నిదానంగా వెళ్లే అవకాశాలు ఉంటాయి. తద్వారా ప్రమాదాలు జరగకుండా అండే అవకాశం ఉంటుంది. ప్రమాదం జరిగిన వారం రోజుల తర్వాత ఈ ప్రాంతంలో ముందు మూల మలుపు ఉంది, నెమ్మదిగా పోవాలని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలు జరిగితే తప్పా హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

బాలోత్సవంలో గన్నవరం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మాచర్ల రూరల్: నర్సరావుపేటలో నిర్వహించిన పల్నాడు బాలోత్సవంలో గన్నవరం గ్రామ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి, పలు బహుమతులు అందుకున్నారు. ఏకపాత్రాభినయంలో ఎం.అమృత, పాటల పోటీలో తన్నీరు వెన్నెల, మట్టిబొమ్మల తయారీలో బాల సైదులు, పద్యాలు వల్లె వేయడంలో నవ్యతో పాటు పలువురు విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం షేక్ అన్వర్ ఖాన్, శిక్షణనిచ్చి కృషి చేసిన ఉపాధ్యాయురాలు శాంతిబాయిని అభినందించారు.

నేత్ర వ్యాధులపై అవగాహన అవసరం



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వివేకానందరెడ్డి

సత్తెనపల్లి: మానవుల శరీర భాగాల్లో నేత్రానికి అధిక ప్రాధాన్యత ఉందని అటువంటి నేత్రవ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, డాక్టర్ ఎంవీ రెడ్డి నేత్ర వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాములయ్య మాట్లాడుతూ నేటి మానవ జీవన ప్రయాణంలో వయసుతో నిమిత్తం లేకుండా మనం ఊహించని వ్యాధులు సోకుతున్నాయన్నారు. ముఖ్యంగా ఒకప్పుడు వయస్సు పై బడి వచ్చే వ్యాధులు నేడు వయస్సుతో నిమిత్తం లేకుండానే వస్తున్నాయన్నారు. ముఖ్యంగా నేత్ర వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభం అవుతుందన్నారు. అనంతరం డాక్టర్ ఎంవీ రెడ్డి ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ ముద్దం వివేకానంద రెడ్డి మాట్లాడుతూ అన్ని అవయవాల కన్నా కళ్లు ముఖ్యమైనవన్నారు. ఎంతో సున్నితమైన కంటివ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా శాశ్వతంగా చూపును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. షుగర్ వ్యాధి వల్లన కంటికి సంబంధించి నరాల్లో జరిగే మార్పుల వల్లన రెటీనా క్షీణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మొత్తం 111 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు, అధ్యక్షుడు గద్దె చలమయ్య, మహిళా సంఘ నాయకులు గద్దె ఉమశ్రీ, గుంటుపల్లి రజని, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రాజ్‌కుమార్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి హరిపోతురాజ్, తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సత్తెనపల్లి: నిరుపేద కుటుంబానికి చేయూత అందించేందుకు సత్తెనపల్లి ప్రజా చైతన్య భారతి సేవా సంస్థ ముందుకు వచ్చింది. పట్టణంలోని నాగార్జున నగర్ సందిగాం డొంక రోడ్డులో నివాసం ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఉయ్యూరు వెంకటరెడ్డి, అనురాధ దంపతుల కుటుంబానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు యిర్మీయా సలహా మేరకు అధ్యక్షుడు దూపగుంట్ల జానకి రామయ్య, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మద్దిరాల గంగాధర్, న్యాయవాది సర్వేపల్లి సీతా రామంజనేయులు ఆదివారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ దంపతుల్లో అనురాధకు బ్రెయిన్ ఆపరేషన్ జరిగి చాలా ఖర్చు పడి రోజు వారికి కూడా ఇబ్బంది పడుతున్నారు. సంస్థ బాధ్యులు పి.ఆంజనేయులు, మల్లేశ్వరావు, కె.ప్రేమ్‌కుమార్, నాసరయ్య, ఇ.ప్రసాద్, హరిబాబు పాల్గొన్నారు.